


**బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు**

: గండ్రా వెంకటరమణారెడ్డి


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని

అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

J V NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 364 శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# యూనివర్సిటీలపై కేంద్రం కుట్రలు




**కలసి పోరాడుదామని భట్టి పిలుపు**

**ఉమ్మడి జాబితాలోని అంశంపై పెత్తనం చలాయిస్తామంటే కుదరదు**

**రాష్ట్రాలు సామంత రాజ్యాలు కాదుదేశ పురోగతికి అవి జీవనాడీ**

**ప్రజలకు అవసరమైన విద్య వ్యవస్థలనురాష్ట్రాలే నిర్మించుకుంటాయి**

**తిరువనంతపురం జాతీయ ఉన్నతవిద్య సమ్మేళనంలో డిప్యూటీ సీఎం**

తిరువనంతపురం,ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): యూనివర్శిటీలపై కేంద్రం కుట్రలపై కలిసి పోరాడుదామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.. కేరళ తిరువనంతపురంలోని జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో పాల్గొన్న ఆయన.. విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేరని మండిపడ్డారు. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందించాలన్నారు. విద్యా, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రాల నిర్ణయాలను కేంద్రం గౌరవించాలన్నారు. రాష్ట్రాలు పరిపాలన విభాగాలే కాదు..దేశ పురోగతికి జీవనాడులని భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రం యూనివర్శిటీల్లో రాష్ట్రాల పాత్రను తొలగించాలని చూస్తోంది. నియామకాల నుంచి అడ్మిషన్ల వరకు రాష్ట్రాలకు హక్కు లేకుండా చేసే కుట్ర చేస్తోంది. ప్రజలకు వ్యవస్థలకు సరిపోయే విద్యాసంస్థలను రాష్ట్రాలే నిర్మించుకుంటాయి. ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి పోలిక ఉండదు. సొంత నిర్ణయాలు లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రం అందించలేదు. రాష్ట్రాలు ఒక ఉమ్మడి లక్ష్యంతో ఐక్యమైనపుడు కేంద్రం తప్పక వినాలి. ఒక రాష్ట్ర విద్యార్థుల నాడి ఆ రాష్ట్రానికి తెలుస్తుంది అని భట్టి అన్నారు.

# నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



## నారాయణపేట జిల్లా అప్పక పల్లెలో శ్రీకారం




తొలివిడతలో రాష్ట్రవ్యాప్తంగా 72,045 ఇందిరమ్మ ఇళ్లు

మంజూరు శంకుస్థాపన కాగానే మొదటివిడత కింద

లబ్ధిదారుల ఖాతాల్లో లక్ష రూపాయలు జమ నేడు

వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో సిఎం పర్యటన

నారాయణపేటలో ముఖ్యమంత్రి బహిరంగసభ

# ఎప్‌సెట్ నోటిఫికేషన్ విడుదల




**25 నుంచి దరఖాస్తులు ఎస్సి ఉపకులాల వారీగా దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 29,30 తేదీలలో అగ్రికల్చర్, ఫార్మావిభాగం పరీక్షలు**

**మే 2 నుంచి 5 వరకు ఇంజనీరింగ్ పరీక్ష**

హైదరాబాద్ ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రం లో ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ వి భాగాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టి జి ఎప్‌సెట్(ఇఎపిసెట్) నోటిఫికేషన్ వి డుదలైంది. టిజిఇఎపిసెట్‌కు ఈనెల 25 వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఉన్నత విద్యామండ లి వెల్లడించింది. ఏప్రిల్ 4 వరకు ఎలాం టి ఆలస్య రుసుం లేకుండా విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చు. ఏప్రిల్ 29, 30 తేదీ ల్లో అగ్రికల్చర్,ఫార్మసీ విభాగాలకు, మే 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇఎపిసెట్‌కు ఈసారి ఇంటర్ మొద టి, ద్వితీయ సంవత్సరాల నుంచి 100 శాతం సిలబస్ తీసుకోవాలని సెట్ కమి టీ నిర్ణయించింది. ఇఎపిసెట్ పరీక్షలు జెఎన్‌టియుహెచ్ నిర్వహించనున్నది. రాష్ట్రంలో ఎస్సి వర్గీకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎప్‌సెట్ సహా వివిధ ప్రవేశ పరీక్షలకు ఉపకులాల వా రీగా దరఖాస్తులను స్వీకరించాలని రా ష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది.ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నది. అయితే ఇప్పటివరకు ఎస్సి వర్గీకరణపై మూడు గ్రూపులుగా కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఎస్సి కేటగిరీకి చెందిన విద్యార్థులు వారి కులాన్ని ఆన్‌లైన్ దరఖాస్తులో పొందుపరిచేలా ఏర్పాట్లు చేశారు. దాని వల్ల ప్రవేశాల సమయంలో రిజర్వేషన్ అమలు చేయడానికి వీలవుతుందని అధికారులు చెబుతున్నారు. మిగతా ప్రవేశ పరీక్షలలోనూ ఇదే అమలు చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం





# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం

**ప్రమాణం చేయించిన ఎల్జీ వికె సక్సేనా**

**హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు**

**ఎన్డీ పక్షాన సిఎంలు, డిప్యూటీ సిఎంలు హాజరు**

**ప్రత్యేక ఆకర్షణగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్**

దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెప్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు.


2లో


# బిఆర్ఎస్ అండతోనే ఎపి జలదోపిడీ



**కృష్ణా జలాల్లో 200 టిఎంసిలు చాలన్న ఘనులు**

**- శ్రీశైలం,సాగర్‌లను ఎపికి అప్పగించి చోద్యం చూశారు**

**నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారు**

**- బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంపై మండిపడ్డ ఉత్తమ్ కుమార్**


2లో


# ఐబీఐసీడీ విచారణకు ఆదేశం

**సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసుపై ప్రభుత్వ కీలక నిర్ణయం**

**గండ్ర వెంకటరమణారెడ్డే హత్య చేయించాడని మృతుడి భార్య ఆరోపణలు**


2లో


# నైతిక విలువలు పాటించాలి




**ఓటీటీ, సామాజిక మాధ్యమాలకు కేంద్రం హెచ్చరిక**

**అశ్లీల కంటెంట్‌పై ఫిర్యాదులు వచ్చాయని వెల్లడి**

**చిన్నారులకు 'ఏ' రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండా చూడాలన్న కేంద్రం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): ఓటీటీ, సామాజిక మాధ్యమాలు ఐటీ చట్టంలోని మార్గదర్శకాలను పాటించాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఐటీ చట్టం-2021లోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. అశ్లీల కంటెంట్‌పై అనేక ఫిర్యాదులు అందాయని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

# వాటామేరకే నీటిని వాడుకుంటున్నాం



**తెలంగాణ నేతల జలదోపిడి ఆరోపణలపై స్పందించిన చంద్రబాబు**

**ఏపీ జల దోపిడీకి పాల్పడుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపణ**

**కృష్ణా జలాల్లో అధిక నీటిని వాడుకుంటున్నామనే ఆరోపణలను కొట్టిపారేసిన చంద్రబాబు**

**వాటా మేరకే నీటిని వినియోగించుకుంటున్నట్లు వెల్లడి**


2లో

# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం

న్యూఢిల్లీఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు.



27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖాగుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు. ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. 25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించనున్నారు. హరియాణాలోని జులానాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. దిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బీకాం చదివారు. ఆ సమయంలోనే ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించారు. 1995-96లో దిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 1996-97లో అధ్యక్షురాలిగా సేవలందించారు. మేరఠ్‌లోని చౌధరీ చరణ్‌సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం పట్టా



పుచ్చుకొని కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. 1998లో మనీశ్‌గుప్తాను వివాహం చేసుకున్నారు. 2007లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. ప్రస్తుతం భాజపా మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. భాజపా నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 5వ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సీఎం పదవిని చేపట్టిన 18వ అతివగా రేఖాగుప్తా నిలిచారు.

# బిఆర్ఎస్ అండతోనే ఎపి జలదోపిడీ

హైదరాబాద్, ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత భారాసదని విమర్శించారు. నీటి పారుదల రంగాన్ని పూర్తిగా నాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని కమిషన్ల కక్కుర్తితో అధిక వడ్డీకి వేల కోట్లు అప్పులు తెచ్చారని ఆరోపించారు. అప్పుల నుంచి బయటపడేందుకు తాము ప్రయత్నిస్తుంటే..బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎస్ఎల్ బీసీ టన్నెల్ ను పదేళ్లు పూర్తిగా పడుకోబెట్టారని ఆరోపించారు. లక్షా 85 వే లకోట్లు ఖర్చు చేసి ఎకరాకు నీళ్లివ్వలేదన్నారు ఉత్తమ్. సగం పూర్తయిన ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదు.. విభజన చట్టం అమలు కోసం కేసీఆర్ ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలని వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదన్నారు. భారాస ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ.. భారాస నేత జేబులు



నిండాయి. కాళేశ్వరంపై రూ.లక్షా 30వేల కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ కూలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించుకోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, దిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో పూర్తి చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. ఈక్రమంలోనే శ్రీశైలం ప్రాజెక్టును ఏపీకి అప్పగిస్తామని 2021-22లో బీఆర్ఎస్ ఒప్పుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నాగార్జున సాగర్ శ్రీశైలం ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగిస్తామని 2021లో బీఆర్ఎస్ ఒప్పుకుందన్నారు. 2023 నవంబర్ లో సాగర్ ను ఏపీ ఆక్రమించింది.. ఏపీ ఆక్రమణ తర్వాతే సాగర్ సీఆర్పీఎఫ్ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి రోజు 4.2 టీఎంసీలు తీసుకెళ్లారని చెప్పారు ఉత్తమ్. రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ హయాంలో రోజూ 9.6 టీఎంసీలు దోచుకెళ్లారని ఆరోపించారు ఉత్తమ్. కృష్ణా నీళ్లను ఏపీకి దోచి పెట్టినందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించారని విమర్శించారు. హరీశ్ రావు ఇరిగేషన్ మినిస్టర్ గా కాదు..అసలు దేనికి పనికి రాడన్నారు. తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలు కాపాడుతామని వ్యాఖ్యానించారు.ఏపీ నీళ్ల దోపిడికి పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు . జగన్ దోస్తీ కోసం రాయలసీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు వదిలేశారని చెప్పారు. పదేళ్లలో శ్రీశైలం నుంచి ఔట్ సైడ్ బేసిన్ 1200 టీఎంసీలు తరలించారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు 550 టీఎంసీలు రావాల్సి ఉన్నా.. 298 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత కేసీఆర్ దేనని విమర్శించారు. కేసీఆర్ అసమర్థత,చేతగాని తనం వల్లే పాలమూరుకు నీటి కష్టాలు వచ్చాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం టెలిమెట్రీ పరికరాలు కూడా పెట్టలేదని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. మేడిగడ్డ కూలితే ఒక్క పిల్లరే కూలిందని వాదిస్తున్నారు. వాళ్లే కట్టారు..వాళ్లే దోచుకున్నారు..వాళ్లే కూలగొట్టారు. కాళేశ్వరం అప్పులు తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ భారమే. పాలమూరుకు వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నీళ్లివ్వలే. నీళ్ల కోసం కాదు బీఆర్ఎస్ నేతలు జేబులు నింపేందుకు కట్టారు. కృష్ణా నీళ్లలో ఏపీ దోపిడిని కేంద్రానికి వివరించాం.. కృష్ణా జలాల వాటా విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది. ఏపీ నీళ్ల దోపడిలో కేంద్రం జోక్యం చేసుకోవాలని ఉత్తమ్ అన్నారు.

# నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

## నారాయణపేట జిల్లా అప్పక పల్లెలో శ్రీకారం

హైదరాబాద్ ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): సిఎం రేవంత్ రెడ్డి నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా కీలకమైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రభుత్వం అన్నీ దఫాల వడబోత అనంతరం అర్హులను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో నేడు (శుక్రవారం) సిఎం నారాయణపేట జిల్లా పర్యటన సందర్భంగా నారాయణపేట మండలంలోని అప్పకపల్లెలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి రాష్ట్రంలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 72,045 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటికి నేడు శంకుస్థాపన పనులు మొదలు కానున్నాయి. ఇల్లు లేని కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వ సంకల్పంలో భాగంగా లబ్ధిదారులు సొంతంగా ఇల్లు కట్టుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించనుంది.

మొదటి విడతలో 72,045 లబ్ధిదారుల ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఉన్న పేదలు, ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేందుకు రూ.5,00,000ల చొప్పున నిధులను విడుదల చేయనుంది. ఈ నిధులను నాలుగు విడతల్లో లబ్ధిదారుడికి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇందులో భాగంగా తొలి విడతలో లక్ష రూపాయలను లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయనుంది. లబ్ధిదారుల జాబితా ప్రస్తుతం ఇన్‌చార్జీ మంత్రుల చేతుల్లో ఉంది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షిస్తు న్నారు. ఇందిరమ్మ ఇల్లు ఇప్పటివరకు 80 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా




మొదటి విడతలో 72,045 లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేసింది.

శంకుస్థాపన కాగానే తొలి విడతగా రూ.లక్ష చెల్లింపు

నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన, భూమి పూజ చేసిన కుటుంబాలకు తొలి విడతగా ప్రభుత్వం రూ.లక్షను బ్యాంక్ అకౌంట్‌లలో వేయనుంది. ఆ డబ్బుతో పునాది వేసి గోడలు నిర్మించుకొని, కిటికీల ఎత్తువరకు గోడలను నిర్మించుకోవాల్సి ఉంటుంది. అప్పుడు అధికారులు పరిశీలించి, రెండో విడత నగదు పంపిణీని చెల్లిస్తారు. ప్రభుత్వం రెండో విడతగా రూ.1.25 లక్షలను లబ్ధిదారునికి ఇవ్వనుంది. ఆ డబ్బుతో ఇంటి నిర్మాణం దాదాపు పూర్తవుతుంది. అయితే స్లాబ్ నిర్మాణం కోసం మరో రూ.1.75 లక్షలను ప్రభుత్వం చెల్లించనుంది. ఆ తర్వాత కరెంటు, బాత్రూం, నీటి సరఫరా ఇతరత్రా వాటికి మరో రూ.లక్షను ప్రభుత్వం లబ్ధిదారుడికి చెల్లిస్తుంది. ఇలా మొత్తం రూ.5 లక్షలను లబ్ధిదారుడికి ప్రభుత్వం వారి బ్యాంకు అకౌంట్‌లలో వేయనుంది.మొదటివిడతలో భాగంగా 4.5 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడికి సుమారుగా రూ.5 లక్షలను చెల్లించనుంది. మరో 4 సంవత్సరాల్లో మొత్తం 20 లక్షల ఇళ్లు నిర్మించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అయితే ఎవరైనా ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోకపోతే ప్రజా పాలనలో చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారం నింపేవారు అందుకు సంబంధించిన పత్రాలు, జిరాక్స్ కాపీలను జత చేయాల్సి ఉంటుంది. ఇది నిరంతర ప్రక్రియ కావడంతో దీనికి చివరితేదీ లేదని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం దరఖాస్తు దారుల వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేస్తోంది. అర్హుల వివరాలన్నీ ఆ యాప్‌లో నమోదై ఉంటాయి.

నేటి ముఖ్యమంత్రి పర్యటన వివరాలు ఇలా%ౌ.

%వికారాబాద్, నారాయణ పేట జిల్లాల్లో పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చేరుకుంటారు. పోలేపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆ తర్వాత నారాయణ పేట మండలం అప్పక్‌పల్లి చేరుకుంటారు అక్కడ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారు. బిపిసిఎల్ కంపెనీ సహకారంతో పూర్తిగా మహిళలచే నడిపే పెట్రోల్ బంక్ ఇది. రాష్ట్రంలోనే మొదటి సారి ఈ తరహా బంక్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం అప్పక్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. నారాయణపేట మెడికల్ కాలేజీలో అకాడమిక్ బ్లాక్‌తో పాటు, ఇతర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గురుకుల హాస్టల్ ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

# వాటా మేరకే నీటిని వాడుకుంటున్నాం

**అమరావతి** ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు నాయకులు ఆంధ్రప్రదేశ్ జల దోపిడీకి పాల్పడుతోందంటూ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. కృష్ణా నదిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిక నీటిని వాడుకుంటుందన్న తెలంగాణ నేతల వాదనలో ఎటువంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన వాటా మేరకే నీటిని వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గోదావరి నదిలో మిగులు జలాలు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలో కలిసే నీటిని మాత్రమే అదనంగా వాడుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. కృష్ణా జలాల విషయంలో మాత్రం కొంత సమస్య ఉందని, దీనికి సత్వర పరిష్కారం కనుగొనవలసిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# నైతిక విలువలు పాటించాలి

**(మొదటి పేజి తరువాయి)** యూట్యూబ్‌లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించాలని ఇటీవల సుప్రీంకోర్టు కూడా ఆదేశించిందని గుర్తు చేసింది.ఇండియాస్ గాట్ లాటెంట్ షోలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ క్రమంలో నిబంధనలు పాటించాలని కేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఏ' రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండా చూడాలని ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘించే ఏ కంటెంట్‌ను కూడా ప్రసారం చేయవద్దని స్పష్టం చేసింది. వయస్సు ఆధారిత కంటెంట్ అందుబాటులో ఉండాలని తెలిపింది. ఓటీటీలు స్వీయ నియంత్రణను కలిగి ఉండాలని, నైతిక విలువలను పాటించాలని తెలిపింది.

# సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసుపై ప్రభుత్వ కీలక నిర్ణయం

**ఐబీఐసీడీ విచారణకు ఆదేశం**

**గండ్ర వెంకటరమణారెడ్డే హత్య చేయించాడని మృతుడి భార్య ఆరోపణలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): జయశంకర్ భూపాలపల్లిలో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య తీవ్ర కలకలం రేపుతోంది. లింగమూర్తి హత్య ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ హత్యపై సీబీసీఐడీ ఎంక్వైరీ వేయాలని నిర్ణయించింది. మేడిగడ్డ అవినీతిపై పోరాడుతున్నందుకే లింగమూర్తిని హత్య చేసారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన అనుచరులే రాజలింగమూర్తిని చంపారని మృతుడి భార్య, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా నడిరోడ్డు మీద తన భర్తను హత్య చేయించారన్న రాజలింగమూర్తి భార్య సరళ ఆరోపించారు. అన్ని ఆపేస్తే పది లక్షల రూపాయలు ఇస్తామని గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారని తెలిపారు. మేడిగడ్డ కేసు గెలుస్తామని అక్కస్సుతో తన భర్తను దారుణంగా హత్య చేయించారని అన్నారు. కొత్త హరిబాబు రేణిగుంట్ల సంజీవ్ బుర్ర చంద్రయ్య, బుర్ర కొమురయ్య రేనిగుంట్ల కొమురయ్య మరికొంతమంది కలిసి హత్య చేశారని సరళ ఆరోపించారు. ఇప్పటికే భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు రాజలింగమూర్తి బంధువులు చేరుకున్నారు. కాగా... బైక్‌పై వెళ్తున్న రాజలింగమూర్తిని ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుపై లింగమూర్తి కేసు వేశారు. ఆ ఫిర్యాదుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుతో పాటు ఐదుగురిపై కేసు నమోదు అయ్యింది. దీంతో పాటు భూపాలపల్లిలో వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై రాజలింగమూర్తి కేసు వేశారు.

# హైడ్రాను మరింత పటిష్టం చేయాలి

**భూ కబ్జాదారుల ఆటకట్టిస్తున్న హైడ్రా**

**విలేకరుల సమావేశంలో శివారు ప్రాంత బాధితులు**


హైదరాబాద్,ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాను మరింత పటిష్టం చేయాలని పలువురు భూ కబ్జాదారుల బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కబ్జాదారుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలకు హైడ్రా పరిష్కారం చూపుతోందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరం, శివారు ప్రాంతాలకు చెందిన బాధితులు నాగేశ్వరరావు, సాయికుమార్, చంద్రశేఖర్, తనూజ, శ్రీనాథ్, గాయత్రి, నవీన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వంటి మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందని, కబ్జాదారుల బారి నుంచి తమను రక్షిస్తుందని చెప్పారు. కొంత మంది కబ్జాదారులు హైడ్రాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హైడ్రా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని చెప్పారు. పార్కులు, చెరువులు, ప్రభుత్వ స్థలాను కబ్జా చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసిన బాధితులపై కక్షపూరిత కేసులు నమోదు చేస్తున్నారని, సీఎం స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు తమకు హైడ్రా చేసిన మేలును, కబ్జాదారులు వేధిస్తున్న వివరాలను పలువురు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దివ్యనగర్, కోహెడ, అమీన్‌పూర్, నాగిరెడ్డి చెరువు, ముత్తంగి, బడంగ్ పేట్ తదితర ప్రాంతాల్లో హైడ్రా వల్ల లబ్ధిపొందిన వారు పాల్గొన్నారు.

## ఎప్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

**(మొదటి పేజి తరువాయి)** ఎస్‌సి విద్యార్థులకు ప్రవేశాల్లో 15 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. ఎస్‌సి కేటగిరీలో ఉపకులాలతో సంబంధం లేకుండా సీట్లు కేటాయిస్తున్నారు. ఇటీవల ఎస్‌సిలను 3 గ్రూపులుగా వర్గీకరిస్తూ కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేయగా, అసెంబ్లీ, శాసనమండలి వర్గీకరణకు ఆమోదం తెలిపాయి. ఎస్‌సి వర్గీకరణకు సంబంధించిన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత గ్రూపుల వారీగా రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉంటుంది.సాధారణంగా ప్రవేశ పరీక్షలు ముగిసిన తర్వాత ఆయా సెట్ కన్వీనర్ ప్రాథమిక కీ విడుదల చేసి, దానిపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. అయితే ఈసారి ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలలో ప్రాథమిక కీ పై విద్యార్థులు అభ్యంతరాలు తెలిపేందుకు ఫీజు చెల్లించే విధానం అమలు చేయనునున్నారు. రూ.500 చెల్లించి విద్యార్థులు ప్రాథమిక కీ పై ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు తెలియజేయాలి. అంటే ప్రవేశ పరీక్షల ప్రాథమిక 'కీ' అభ్యంతరాలపై ఇక నుంచి ఫీజులు వసూలు చేయనున్నారు

# క్వాలిఫికేషన్ లేని వైద్యం

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపి చికిత్స -పట్టించు కొని వైద్య శాఖ








తల్లాడ/ఫిబ్రవరి20(జర్నలిస్ట్ వార్త): క్వాలిఫికేషన్ లేని వైద్యం తో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం మడుతున్నారు కొందరు ఆర్ఎంపి లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేస్తూన్నా ప్రభుత్వ వైద్య శాఖ అధికారులు పట్టించు కొని పరిస్థితి లో ఉన్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండలం ప్రజలు. తెలిసి తెలియని వైద్యం చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలు ఆడుకుంటున్న ఆర్ఎంపి డాక్టర్ గతంలో అన్నారు గూడెం ప్రాంతంలో ఇంజక్షన్ వికటించడంతో అమాయక ప్రజల ప్రాణాలు పోవటం జరిగింది.పర్మిషన్ లేకుండా రూములు బెడ్స్ ఇంజక్షన్ టాబ్లెట్లు ఉపయోగిస్తున్న ఆర్ఎంపీ డాక్టర్లపై తక్షణమే జిల్లా అధికారులు చర్య తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.తల్లాడ మండలం కుర్న వల్లి గ్రామంలో వైద్యం అందించడానికి క్వాలిఫికేషన్ లేకపోయినా ఇష్టానుసారంగా అమాయక ప్రజలపై వైద్యం అందిస్తూ అమాయక ప్రజల ప్రాణాలను ఆడుకుంటున్న ఆర్ఎంపి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుపుతున్నడని డిఎంహెచ్ వో, డ్రగ్స్ అధికారులు ను వివరణ కోరగా కుర్నవల్లి ప్రాంతంలో వైద్యానికి ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని డ్రగ్స్ మందులు మెడికల్ షాప్ కి ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని జిల్లా అధికారులు చెప్పారు. గ్రామపంచాయతీ సెక్రెటరీ వివరణ కోరగా ఎలాంటి అనుమతులు లేవని వివరించారు. అనుమతి లేని వైద్యం చేస్తున్న ఆర్ఎంపి పై జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి మరి.!

# సంకీర్ణ రాజకీయాలు ప్రజాస్వామ్యంపై జాతీయ సెమినార్

### - తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిస్టా రెడ్డికి ఆహ్వానం



హనుమకొండ/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగంలో మార్చి 21, 22 తేదీన భారతీయ సమాజంలో సంకీర్ణ రాజకీయాలు, ప్రజాస్వామ్యం అనే అంశంపై జాతీయ సెమినార్ కు ప్రణాళికలు రూపొందించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపిన వివరాల మేరకు వచ్చేనెల 2 రోజుల పాటు తలపెట్టిన కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిస్టా రెడ్డిని ఆహ్వానిస్తూ హైదరాబాదులోని వారి కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి, సెమినార్ కు ముఖ్య అతిథులుగా వారు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేసి, స్వాగతించగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వారి వెంట కార్యక్రమం నిర్వహకులు అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపల్లి నాగరాజు, రీసెర్చ్ స్కాలర్స్ అంకెళ్ల శంకర్, కలిపికొండ వినోద్ ఉన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు పంపిణీ

### - పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలి
### - అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రాజేందర్



గణపురం/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): గణపురం మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో గురువారం అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు పెన్నులు, ఫ్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు వివిధ శాఖలలో అధికారులుగా కొనసాగుతున్నారు. ఏదో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. ఈసారి జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు తిరిగి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆరుముళ్ళ ఎల్లస్వామి, బీసీ సంఘాల జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని శంకర్ గౌడ్, దూడపాక దుర్గయ్య, ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు దూడపాక శ్రీనివాస్, ఇంజపెల్లి రవికుమార్, బొల్లి రమేష్, ఉపాధ్యాయులు, ఇన్చార్జి ప్రిన్సిపాల్ భరత్ కుమార్, శ్రీనివాస్, రాంబాబు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు



రాయపర్తి/ఫిబ్రవరి20(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో గురువారం షేర్ ఎన్జీవో జస్ట్ రైడ్ ఫర్ చిల్డ్రన్స్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా షేర్ ఎన్జీవో కోఆర్డినేటర్ టీ శిరీష మాట్లాడుతూ మైనర్ బాలికలకు వివాహం చేసినట్లయితే రూపాయలు ఒక లక్ష జరిమానా తో పాటు రెండేళ్లు జైలు శిక్ష విధించబడుతుందని అన్నారు.బాలికలు సోషల్ మీడియా పరంగా చాలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు.అనంతరం యాంటీ వుమెన్ ట్రాఫిక్ (ఏ .హే .టీ .యూ ) ఎస్ ఐ ఫిలిప్ రాజు మాట్లాడుతూ పిల్లలు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, ట్రాఫికింగ్ కి గురికా వద్దని అన్నారు. పిల్లల పైన జరిగే అఘాయిత్యాలు అనేవి 90% తెలిసిన వారి ద్వారానే జరుగుతుంది అన్నారు.పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లైంగికంగా వేధింపులకు గురిచేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1098 కి సమాచార%శీ% అందించాలని ఇది 24/7 పనిచేస్తుందని తెలియజేశారు. అనంతరం విద్యార్థినిలతో బాల్యవివాహాలకు వ్యతిరేకముగా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.అలాగే పిల్లలపై జరిగే అఘాయిత్యాల గురించి వివరించిన డిపార్ట్మెంట్ వారికి స్కూల్ ప్రిన్సిపల్ సరిత కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో షేర్ ప్రతినిధులు ఎన్జీవో కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ జన్ను ప్రభాకర్,ప్రశాంతి,గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# పదివతరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన



కల్లూరు/ఫిబ్రవరి21(జర్నలిస్ట్ వార్త): పదివ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించడం జరుగుతుందని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సుదర్శన్ రావు అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పేరువంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో మార్చి 22 నుండి ఫైనల్ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల యొక్క ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవతో ఉదయం 8 గంటల నుండి తొమ్మిది గంటల వరకు స్టడీ అవర్స్, సాయంత్రం 4:15 నుంచి 5 20 వరకు ప్రత్యేక క్లాసులు నిర్వహింస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం ప్రత్యేక సబ్జెక్టుతో స్పెషల్ క్లాసులు ఏర్పాటుచేసి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ సర్కార్ అందిస్తున్న సదుపాయాలను పదవ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు.

# ఉన్నఫళంగా పనులు మానేస్తే ఎలా?

### - ప్రజా ప్రభుత్వంలో ప్రజలు పస్తులుండాల్సిందేనా?
### - ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే కేఆర్
### - నియోజకవర్గ ప్రజల ఆకలి కష్టాలపై కాస్త దృష్టి పెట్టాలి



వర్ధన్నపేట/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట నియోజకవర్గంలో కొద్ది రోజులుగా ఇసుక తవ్వకాలు, రవాణాకు తెరపడింది. గురువారం వర్ధన్నపేట ఎస్సై చందర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆసీఫ్ మండలంలోని వర్ధన్నపేట, ఇల్లంద, కొత్తపల్లి, ల్యాబర్తి గ్రామాలకు చెందిన వాగు పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రత్యేకించి ఇసుకపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో ఎప్పుడూ లేనిది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇలాంటి పరిస్థితి ఏర్పడడం ఇది రెండవసారి అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం పూర్తి అయినప్పటికీ నియోజకవర్గ ప్రజల జీవనోపాధి కోసం ఎలాంటి ప్రణాళిక రూపొందించారు. తరాలుగా ఆధారపడి చేస్తున్న పనులు ఉన్నఫళంగా నిలిపివేసి ఎలా బ్రతకాలి? అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమైన ఇసుక తవ్వకాలు, రవాణా నిలిపి వేయడానికి వారికి ఎలాంటి అభ్యంతరం లేదని చెబుతున్నారు. కొన్న ట్రాక్టర్లకు, ఉన్న విద్యాకు ఉద్యోగాలు, అసలేమీ చదువుకోని వారికి ఔట్సోర్సింగ్ ద్వారా కల్పించే స్వీపర్ ఉద్యోగాలలో అవకాశాలు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రజల జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్నారు. మరి ఆయన నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు సహజీవనం కోల్పోతున్నారు. ఇలాంటి పరిస్థితితుల్లో ఎమ్మెల్యే ప్రజల కష్టాలపై దృష్టి పెట్టాలని బాధితులు కోరుతున్నారు.

# ఉపాధి హామీ పథకంలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలి

### - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): జిల్లాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిర్దేశించిన గడువులోగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఈఈ, డీఈ, ఏఈలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన పనులు, వాటి పురోగతి, రానున్న మార్చినాటికి సంబంధించి ఉపాధి పనుల గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం నిర్దేశిత పనులను పూర్తిచేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కోసం అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. మొక్కలు పెంపకానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీలో వ్యవసాయ అనుబంధ పనులకు సంబంధించినవి పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు, ఉపాధి కూలీలకు పని దినాల సంఖ్యను పూర్తిస్థాయిలో కల్పించడం, నిర్దేశిత లక్ష్యాన్ని మార్చి నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేటట్టు చూసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించాలన్నారు. డీఆర్డీవో మేన శ్రీను మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పని దినాల సంఖ్య నవంబర్ నుండి ఫిబ్రవరి వరకు రెండు లక్షల యాభైనాలుగు వేలుగా నిర్దేశిత లక్ష్యంగా ఉందని, మిగతా నిర్దేశిత లక్ష్యాన్ని మార్చినాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులకు తెలియజేశారు. ప్రత్యేక ప్రణాళికతో వంద శాతం పనులను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, డీఈ శ్రీనివాస్ రావు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# అనాధ బాలికకు అండగా ఉంటా


### - కాంగ్రెస్ నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి



రాయపర్తి/ ఫిబ్రవరి20 (జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రానికి చెందిన దుబ్బరి రేణుక టిబి వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందగా గురువారం ఆమె భౌతికాయానికి టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి నివాళ్ళు అర్పించి చిన్నారి రచనను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మానాన్నల అకాల మరణంతో అనాధ మిగిలిన చిన్నారి దుబ్బరి రచన సంరక్షణ బాధ్యతలను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్రెడ్డి లసహాయ సహకారాలతో తాను చేపడుతున్నానని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు బొమ్మెర కళ్యాణ్ గౌడ్,మాజీ ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి నయీమ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మచ్చ రమేష్,గుగులోత్ విజయ్ నాయక్,గారే బిక్షపతి, ఎండి రఫీ, ఎస్కే రఫీ, మచ్చ సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# బావిని బాగు చేయండి

### ఎంపీడీవో డి కర్ణాకర్ రెడ్డికి వినతిపత్రం



జూలూరుపాడు/ఫిబ్రవరి20(జర్నలిస్ట్ వార్త): బావిని బాగు చేయాలని గురువారం ఎంపీడీవో కర్ణాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు జున్ను పాడు గ్రామ ప్రజలు అనంతరం వారు మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలోని స్థానిక పంచాయతీ పరిధిలో కాకతీయ కాలం నాటి అద్భుతమైన రాతి కట్టడం రాజా బావి ఉన్నదని ఇప్పుడు శిధిలవస్థలో ఉండడం రాజాబావి ని అభివృద్ధి చేసి ఉపయోగం లోకి తీసుకురావాలని స్థానిక ఎంపీ ఒక వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.జూలూరుపాడు గ్రామ చివర్లో ఉన్న కాకతీయుల కాలం నాటి రాతి కట్టడమైన రాజా బావి , అని ఈ గొప్ప నిర్మాణం కాకతీయుల కాలంలోనే చేపట్టారని ఇంత ఖ్యాతి ఉన్న రాజా బావి ఇప్పుడు శిథిలావస్థలో ఉండటం బాధాకరంగా ఉందన్నారు. రాజా బావి నీటిని గతంలో గ్రామ ప్రజలతోపాటు వివిధ పరిసర ప్రాంతాలలో నుండి ఈ నీటిని ఉపయోగించే వారిని, ఈ బావిని పట్టించుకోక ప్రస్తుతం బావి చుట్టూ ముళ్ళపొదలు పెరగటంతో పాటు పూడికతో నిండిపోయి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని , పూర్వం ఈ బావినీరె ఉపయోగించే వారిమని తెలిపారు. అలాంటి ఎన్నో గ్రామాలకు నీటిని అందించిన ఈ రాజాబావి నీ అధికారులు మరమ్మతులుచేసి మండలంలో ఉన్న వివిధ ప్రాంతాలకు నీటి అందించాలని తెలిపారు. బావిని బాగుచేసి పూర్వ వైభవములోకి తీసుకురావాలని కోరారు.

# మారెమ్మ ఆలయాల నిర్మాణానికి విరాళాలు



కల్లూరు/ఫిబ్రవరి20(జర్నలిస్ట్ వార్త): కల్లూరు మండల లక్ష్మీపురం గ్రామంలో నూతనంగా నిర్మించదలచిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, మారెమ్మ అమ్మవారి దేవాలయాలకు చిక్కుల అప్పయ్య,చిక్కుల అనసూయ కుమారులు వెంకట రామారావు,రమేష్కు,రళీకృష్ణ, గంధం స్వరాజ్యలక్ష్మి లక్ష్మీపురం గ్రామ ఆలయ నిర్మాణం కొరకు రెండుకుంటల స్థలం కొనుటకు గురువారం రెండు లక్షల పదిహేను వేల నూటపదహారు రూపాయలను విరాళంగా అందించారు. గూగులోతు లక్ష్మీ,సుక్య గ్రామ ప్రజల సమక్షంలో ఒక గుంట స్థలం ఆలయ నిర్మాణం కొరకు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమం లో పసుమర్తి చందరావు, కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు,ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు

# మహాశివరాత్రికి ముస్తాబవుతున్న నాగలింగేశ్వర ఆలయం





గణపురం/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): ? గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల నాటి నాగలింగేశ్వర స్వామి దేవాలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతుంది. గురువారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 26వ, తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించనున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై గణపతి పూజ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అభిషేకానంతరం నాగలింగేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలు, పళ్ళతో బిల్వపత్రాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరుగుతుందన్నారు. నాగలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన ప్రత్యేకతలు వివరించారు. ఈ ఆలయాన్ని కాకతీయ రాజులు ఉత్తర ముఖద్వారంతో నిర్మించడం జరిగిందన్నారు. నాగలింగేశ్వర స్వామి వారు ఉత్తర ద్వారా దర్శనంలో భక్తులకు దర్శనమివ్వడం జరుగుతుందని చెప్పారు. మహాశివరాత్రి రోజున రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

### - వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు





వరంగల్ బ్యూరో/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా పరిధిలో 30 సంవత్సరాలు నిండిన వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు వరంగల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అనుమతులతో చేపట్టిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు మార్చి 31 వరకు నిర్వహించబడునని తెలిపారు. ఉచితంగా నిర్వహించే వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైపర్ టెన్షన్ కొరకు 3982 స్క్రీనింగ్స్ చేయగా 20 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. 3701 మందికి మదిమేహం కొరకు స్క్రీనింగ్ చేయగా 14 మందికి వ్యాధి నిర్ధారణ అయినట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు సైతం పరీక్షలు నిర్వహిస్తున్నాట్లు చెప్పారు. వరంగల్ జిల్లాలో ప్రారంభించిన వ్యాధి నిర్ధారణ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయడానికి ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, పల్లె దావఖాన వైద్యాధికారులు, పట్టణ దావఖాన వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్స్ ఈ కార్యక్రమంపై పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో 30 సంవత్సరాల పైబడిన వారి అందరిని స్క్రీనింగ్ చేస్తున్నారు కాబట్టి, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉచితంగా పరీక్షలు చేసుకొని తగిన చికిత్సలు పొందాలని సూచించారు. ఎన్.సీ.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్, ఎన్.సీ.డి కోఆర్డినేటర్ ప్రకాష్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

# అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ధర్మసాగర్ఫిబ్రవరి20(జర్నలిస్టు వార్త): ప్రతి ఒక్కరూ అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనిల్ కుమార్ అన్నారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, గతంలో నిర్మించి కావలసిన మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చిన డాక్టర్ అబ్దుల్ కలాం టీచింగ్ లెర్నింగ్ సెంటర్ ను ధర్మసాగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనిల్ కుమార్ గురువారం ప్రారంభించారు . ధర్మసాగర్ మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం మండల విద్యాధికారి డాక్టర్ రామ్ధన్ అధ్యక్షతన నిర్వహించారు ముఖ్యఅతిథి అనిల్ కుమార్, మాట్లాడుతూ ప్రస్తుతం మనం 21వ శతాబ్దంలో ఉన్నాము.అన్ని రంగాలలో విపరీతమైన పోటీ ఉన్నది .అదే స్థాయిలో ప్రభుత్వము, సమాజం మనమంతా మంచి స్థితికి వెళ్లేందుకు అవకాశాలు కలిగిస్తున్నది.అందుకే విద్యార్థులంతా అంది వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని ఆకాశమే హద్దుగా ఎదగాలని అన్నారు. తదనంతరం ధర్మసాగర్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుండి విచ్చేసిన పదో తరగతి విద్యార్థులకు మార్చి 2025 లో జరగబోవు పబ్లిక్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విషయ నిపుణులు ఉమాదేవి ,ఫ్రాన్సిస్ , ధర్మ ప్రకాష్ , గిరిధరాచార్యులు, వేణుగోపాల్, శ్వేత ,నవీన్ కుమార్ సూచనలు ఇచ్చారు . ప్రథమ ఉపాధ్యాయులు రాజేందర్, మురళి, శ్రీనివాస్ వివిధ పాఠశాలల్ల గైడ్ టీచర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందము, విద్యార్థి బృందము పాల్గొన్నారు.

# 2023-24 సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ మార్చి 17 నాటికి పూర్తి చేయాలి


- 2024 -25 రబి సీజన్లో 2 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అంచనా
- ధాన్యాన్ని సేకరించేందుకు చర్యలు తీసుకోవాలి
- రైస్ మిల్లర్ల నుండి బ్యాంగ్ గ్యారెంటీ పత్రాలను తీసుకోవాలి
- ప్రజా పంపిణీ దుర్వినియోగం కాకుండా జాగ్రత్త చర్యలు పాటించాలి
- బఫ్ఫర్ గోడౌన్ ల వద్ద టెక్నికల్ అసిస్టెంట్ల కొరత
- టెక్నీకల్ అసిస్టెంట్లను కేటాయించాలని కోరిన మిల్లర్లు
- రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ కు ప్రతిపాదనలు పంపిన కలెక్టర్



వరంగల్ బ్యూరో/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): రబీ 2023-24 సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ వచ్చే మార్చి 17 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రబి 2024- 25 ధాన్యం సేకరణ, 2023-24 సి.ఎం.ఆర్ మిల్లింగ్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సత్య శారదా పౌర సరఫరాల అధికారులు, సంస్థ మేనేజర్, మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024 -25 రబి సీజన్లో. 2 లక్షల 10 వేల మెట్టిక్ టన్నుల వరి ధాన్యం వస్తున్నట్లు అంచనా ఉందన్నారు. ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ 100 శాతం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గోదాంలో ధాన్యం నిల్వలను పరిశీలించాలన్నారు. రైస్ మిల్లర్ల నుండి బ్యాంగ్ గ్యారెంటీ పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థనుండి సరఫరా అవుతున్న బియ్యం దుర్వినియోగం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇంకను బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వని మిల్లర్లు వెంటనే సమర్పించాలని సూచించారు. సీఎంఆర్ బియ్యం డెలివరీ సమయంలో బఫ్ఫర్ గోడౌన్ ల వద్ద టెక్నికల్ అసిస్టెంట్ల కొరత వల్ల లారీలు ఆగుతున్నాయని, టెక్నీకల్ అసిస్టెంట్లను కేటాయించాలని మిల్లర్లు కలెక్టర్ ను కోరారు. ఇట్టి విషయమై రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ కు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి, డిఎఓ అనురాధ, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య , పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సంధ్యారాణి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి నీరజ, ఆర్డీఓ ఉమారాణి, మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ లేబర్ అధికారిపై అవినీతి ఆరోపణలు

### - నిజ నిర్ధారణ కోసం కమిటీ ఏర్పాటు



వరంగల్ బ్యూరో/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లాలోని నర్సంపేట అసిస్టెంట్ లేబర్ అధికారిపై కార్మిక సంఘానికి చెందిన సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిజ నిర్ధారణ కోసం కమిటి ఏర్పాటు చేసినట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నర్సంపేట అసిస్టెంట్ లేబర్ అధికారి అవినీతికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘానికి చెందిన సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. నిజాలను నిగ్గు తేల్చడానికి నియమించిన కమిటీ 10 రోజుల్లో విచారణ నిర్వహించి, నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్, వివిద కార్మిక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్ధాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

### - విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి - సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



వరంగల్ బ్యూరో/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త): వరంగల్జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు. గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి రవిందర్ లతో కలిసి మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని 16 పీఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రచించాలని చెప్పారు. అవగాహన, చైతన్యం కల్పించడం వల్ల సమాజంలో మార్పును తీసుకు రావచ్చునని అన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు గురించి, ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదయ్యాయనే వివరాలను పోలీసు, ఎక్సైజ్, టిఎస్ న్యాబ్, అటవీ, జీఆర్పీ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి రవీందర్ మాట్లాడుతూ ప్రతి నెల నార్కోటిక్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చందర్, ఎఫ్ఆర్ఓ సందీప్, నార్కోటిక్స్ డిఎస్పీ సైదులు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ అరవింద్ కుమార్, టీఎస్ న్యాబ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హత్యా రాజకీయాలు కాంగ్రెస్కే అలవాటు

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మతి భ్రమించింది

### బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు : గండ్రా వెంకటరమణారెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త):

హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకే అలవాటు.. బీఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు అని మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్లో గండ్రా వెంకటరమణారెడ్డి మీడియాతో మాట్లాడారు. భూపాలపల్లిలో రాజలింగ మూర్తి హత్యను బీఆర్ఎస్ మాజీ శాసన సభ్యుడిగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతోందని అన్నారు. ఈ హత్యను బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, హరీశ్రావుకు ఆపాదించాలని కాంగ్రెస్ శతవిధాల ప్రయత్నించడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్థానిక భూవివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని వివరించారు. కొందరి ఒత్తిడితో రాజలింగ మూర్తి భార్య నాపై ఆరోపణలు చేస్తున్నారని అని వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ హత్యపై సీబీఐ, సీఐడీ విచారణను కాంగ్రెస్ నేతలు కోరుతున్నామన్నారు. ఎలాంటి విచారణ చేసుకున్నా మాకు అభ్యంతరం లేదని తేల్చిచెప్పారు. మేడిగడ్డపై రాజలింగమూర్తి కోర్టులో కేసు వేశారని.. దాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటున్నామని తెలిపారు. మృతుడిపై భూ వివాదాల ఆరోపణలు ఉన్నాయి.. రౌడీ షీట్ కూడా ఉందన్నారు. బీఆర్ఎస్పై, నాపై ఆరోపణలు చేయడం ద్వారా విచారణను ప్రభావితం చేయడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# విమానంలో చిరంజీవి పెళ్లి రోజు వేడుక..



మెగాస్టార్ చిరంజీవి, సురేఖ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని విమానంలో ఘనంగా జరుపుకున్నారు. ఫ్లైట్ లో దుబాయ్ వెళ్తూ పెళ్లి రోజును ఇలా సెలబ్రేట్ చేసుకున్నారు. అక్కినేని నాగార్జున, అమల, నమ్రత శిరోద్కర్ తదితరులు ఆ విమానంలో ఉన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను చిరు తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేయగా వైరల్‌గా మారాయి. "దుబాయ్ మార్గమధ్యంలో కొంతమంది ప్రియమైన స్నేహితులతో విమానంలో మా వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నాం. సురేఖ నా కలల జీవిత భాగస్వామి. ఆమె లాంటి సతీమణి దొరకడం నేను చాలా అదృష్టవంతుడిని అని భావిస్తున్నా. ఆమె నా బలం. ఆమె ఉనికి నిరంతరం ఓదార్పునిస్తుంది. అద్భుతమైన ప్రేరణనిస్తుంది. ఆమె నా మోటివేటర్. థ్యాంక్యూ సోల్‌మేట్. మీ అద్భుతమైన శుభాకాంక్షల కోసం స్నేహితులు, అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు! ఆశీర్వదించండి!" అంటూ చిరు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు

# క్షమించండి..

## ఇకపై నా సినిమాల్లో అసభ్యత ఉండదు : విశ్వక్ సేన్



తన నటన, దర్శకత్వంతో మల్టీ టాలెంటెడ్ హీరోగా పేరు తెచ్చుకున్నాడు విశ్వక్ సేన్. సినిమా సినిమాకీ భిన్న కథలను ఎంచుకుంటూ, కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ కెరీర్ లో ముందుకెళ్తున్న మాస్ కా దాస్ విశ్వక్ సేన్ రీసెంట్ గా లైలా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్ లో సాహు గారపాటి నిర్మించిన ఈ సినిమాలో విశ్వక్ లేడీ గెటప్ లో కనిపించాడు. ఈ సినిమా ప్రమోషన్స్ లో లైలా సినిమాపై నమ్మకంతో విశ్వక్ ఎంతో కాన్ఫిడెంట్ గా సినిమా అందరినీ అలరిస్తుందని చెప్పాడు. ట్రైలర్ చూసి మూవీలో అడల్ట్ కంటెంట్ ఎక్కువగా ఉందేమో కదా అని ప్రమోషన్స్ లో అడిగితే అలాంటిదేమీ లేదని, థియేటర్లలో ప్రతి ఒక్కరూ లైలా మూవీ చూసి ఎంజాయ్ చేస్తారని చెప్పాడు. కానీ తీరా సినిమా థియేటర్లలోకి వచ్చాక లైలా సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ ఆ సినిమా గురించి తిట్టే వాళ్లే. విశ్వక్ కెరీర్లోనే లైలా బిగ్గెస్ట్ డిజాస్టర్ మూవీ అని, అసలు ఇలాంటి అసభ్యకర సినిమాను ఎలా తీశావని సోషల్ మీడియాలో అందరూ విశ్వక్ పై మండిపడ్డారు కూడా. లైలా సినిమా అందరినీ నిరాశకు గురి చేసిన నేపథ్యంలో హీరో విశ్వక్ సేన్ అభిమానులకు ఓ బహిరంగ లేఖ రాశాడు. ఇటీవల "నా సినిమాలు అందరూ కోరుకున్న స్థాయికి చేరుకోలేకపోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శను పూర్తిగా అంగీకరిస్తున్నాను. నన్ను నమ్మి, నా ప్రయాణాన్ని మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ.. నా అభిమానులకు, నాపై ఆశీర్వాదంగా నిలిచినవారికి హృదయపూర్వక క్షమాపణలు. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే, కానీ ఆ ప్రయత్నంలో మీ అభిప్రాయాలను నేను గౌరవిస్తున్నాను. ఇక పై, నా ప్రతి సినిమా క్లాస్ లేదా మాస్ అయినా సరే, అసభ్యత ఉండదు" అని విశ్వక్ రాసుకొచ్చాడు. దాంతో పాటూ "నేను ఒక చెడు సినిమా తీస్తే, నన్ను విమర్శించే హక్కు పూర్తిగా మీకు ఉంది. ఎందుకంటే, నా ప్రయాణంలో ఎవ్వరూ లేని సమయంలో నన్ను ప్రేమతో ముందుకు నడిపించింది మీరు. నా కెరీర్ ప్రారంభం నుంచి నేను ఎంచుకున్న కథలను మీరు ఎంతగా ప్రేమించారో తెలుసు. ఇక పై కేవలం సినిమా మాత్రమే కాదు, నా ప్రతి సన్నివేశం కూడా మీ మనసుకు తగిలేలా ఉండాలని నిర్ణయించుకున్నాను. అంతే కాకుండా, నా మీద విశ్వాసం ఉంచిన ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని విశ్వక్ తన మనసులోని భావాలను లెటర్ ద్వారా పంచుకున్నాడు. విశ్వక్ రాసిన ఆ లెటర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.



# విలాసం కాదు... సౌకర్యం ముఖ్యం: రకుల్

సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీని పెళ్లాడి వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. కొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో వీరి పెళ్లి జరిగింది. పెళ్లికి వచ్చిన అతిథులు సెల్ ఫోన్లు వెంట తీసుకురావద్దనే కండిషన్ పెట్టారు. ఈ అంశంపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో రకుల్ స్పందించారు. పెళ్లి ఫొటోలు, వీడియోలు బయటకు వస్తాయనే భయంతో ఫోన్లను నిరాకరించామనే ప్రచారం జరిగిందని... అందులో వాస్తవం లేదని రకుల్ స్పష్టం చేశారు. వివాహ వేడుకను సింపుల్ గా జరపాలనుకున్నామని... అందుకే కొంతమంది సన్నిహితులను మాత్రమే పెళ్లికి ఆహ్వానించామని చెప్పారు. పెళ్లికి సంబంధించిన మధుర క్షణాలను అతిథులు కూడా ఆస్వాదించాలనే ఉద్దేశంతోనే 'నో ఫోన్' కండిషన్ పెట్టామని తెలిపారు. తన దృష్టిలో విలాసం కంటే సౌకర్యమే ముఖ్యమని అన్నారు. పెళ్లి తర్వాత ఫొటోలను తామే మీడియాకు విడుదల చేశామని తెలిపారు. సినిమాల విషయానికి వస్తే... రకుల్ తాజా చిత్రం 'మేరే హస్బెండ్ కీ బీవీ' ఈ నెల 21వ విడుదల

# ఛావాను రిజెక్టు చేసిన మహేష్‌బాబు



బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం ఛావా. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించగా.. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించాడు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ టాక్‌తో దూసుకెళుతుంది. ఇప్పటికే రూ.150 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.200 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమా కథ మొదట సూపర్ స్టార్ మహేశ్ బాబు దగ్గరికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ మూవీ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ శంభాజీ పాత్ర కోసం మొదట మహేశ్ బాబు సంప్రదించినట్లు తెలుస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట్ నచ్చని మహేశ్ రిజెక్ట్ చేశాడు. దీంతో చాలా రోజుల తర్వాత మళ్లీ ఇదే కథతో విక్కీ కౌశల్ దగ్గరికి వెళ్లగా విక్కీ ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. అయితే మహేశ్‌కి ఇలా సూపర్ హిట్ అయిన సినిమాలు రిజెక్ట్ చేయడం కొత్తేమి కాదు. ఇంతకుముందు కూడా మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన గజిని సినిమాను, అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమాను రానా నటించిన లీడర్, రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన యానిమల్, ప్రభాస్ వర్షం, రవితేజ ఇడియట్, విజయ్ దళపతి నన్బన్, నాగ చైతన్య ఏ మాయ చేసావే, పూరీ జనగణమన (ప్రాజెక్ట్ స్టార్ట్ కాలేదు) తదితర సినిమాలను మహేశ్ రిజెక్ట్ చేశాడు.

# ఆసక్తిరేపుతున్న ఓదెల-2



టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం ఓదెల 2. సంపత్ నంది ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తోన్న ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నాడు. ఓం నమ: శివాయ.. అంటూ తమన్నా శివశక్తి లుక్ ఇప్పటికే నెట్టింట పోస్టర్లు వైరల్ అవుతున్నాయని తెలిసిందే. ఈ చిత్రంలో తమన్నా మహదేవ్‌కు పరమభక్తురాలిగా, ఓదెల సద్గుణ రక్షకురాలిగా కనిపించనుంది. చాలా రోజుల తర్వాత ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్‌ను షేర్ చేశారు మేకర్స్. ఈ సినిమా ఖాతాలో అరుదైన ఫీట్ చేరనుంది. ఓదెల 2 టీజర్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ మేళాలో ఫిబ్రవరి 22న లాంచ్ చేయనున్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో టీజర్ లాంచ్ చేసుకోబోతున్న తొలి ఇండియన్ సినిమాగా చరిత్రలో నిలిచిపోనుంది. ఈ లాంచ్ ఈవెంట్‌కు చిత్రయూనిట్, మేకర్స్ హాజరుకానున్నారు. మొత్తానికి దేశమంతా మహాకుంభ్ మేళావైపు చూస్తున్న నేపథ్యంలో అక్కడే టీజర్ లాంచ్ సినిమాపై అందరి అటెన్షన్‌ను తమవైపునకు తిప్పుకుంటోంది. ఈ చిత్రంలో వశిష్ఠ ఎన్ సింహా, హరిప్రియ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్, మధు క్రియేషన్స్‌పై తెరకెక్కిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఓదెల 2 కోసం తమన్నా శివశక్తి రూపంలోకి ఎలా మారిందని తెలియజేస్తూ మేకింగ్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్.

# దాదాపు పూర్తయిన వార్-2 షూటింగ్

## ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు..



బాలీవుడ్ కథానాయకుడు హృతిక్ రోషన్ , టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రానున్న ఈ స్పై థ్రిల్లర్ ఇది. ఈ చిత్రానికి రైటర్ గా పని చేస్తున్న అబ్బాస్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. "వార్ 2' షూటింగ్ దాదాపు పూర్తయింది. ఆగస్టు 25న విడుదలయ్యే అవకాశం ఉంది. ఆరోజు హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లను థియేటర్‌లో కలుద్దాం. 'వార్ 2'లో డైలాగులన్నీ నేనే రాశాను. అందరికి నచ్చేలా ఉంటాయి. షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్‌ల కాంబోలో ఓ సినిమా ప్రారంభం కానుంది. 'పఠాన్ 2' కూడా సిద్ధమవుతోంది. ఈ రెండు సినిమాలకు రచయితగా వర్క్ చేస్తున్నాను. " అని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్బాస్ తెలిపారు. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్‌హిట్ కావడంతోపాటు భారీ వసూళ్లు రాబట్టింది. సినిమాపై అంచనాలు ఉండటంతో దీనికి సీక్వెల్‌గా 'వార్2' తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. గతంలో సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, షారుక్‌ఖాన్‌లు ఏజెంట్ పాత్రల్లో నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. వీటన్నింటికంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ ఓ షెడ్యూల్ చేసి వచ్చారు. ఈ సినిమా పూర్తయిన తర్వాత తారక్ ప్రశాంత్ నీల్ చిత్రం షూటింగ్‌లో పాల్గొనున్నారు.

# గోలీమార్ సీక్వెల్ రెడీ అవుతున్న పూరీ



అగ్ర దర్శకుడు పూరీ జగన్నాథ్ ప్రస్తుతం ఒక సాలిడ్ కంబ్యాక్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఆయన గత చిత్రాలైన లైగర్, డబుల్ ఇస్మార్ట్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడంతో ఎలాగైన మళ్లీ హిట్టు కొట్టాలనే కసితో పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆయన లేటెస్ట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ బయటికి వచ్చింది. పూరీ జగన్నాథ్ గోపిచంద్ కాంబోలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం గోలిమార్. ప్రియమణి కథానాయికగా నటించగా.. బెల్లంకొండ సురేష్ బాబు ఈ సినిమాను నిర్మించాడు. 2010లో విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా గోపిచంద్ కెరీర్‌లో మరిచిపోలేని చిత్రంగా మిగిలింది. పోలీస్ మాఫీయా బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రంలో గంగారాం అనే పోలీస్ పాత్రలో ఆకట్టుకున్నాడు గోపిచంద్. అయితే ఈ సినిమా వచ్చి 15 ఏండ్ల అవుతున్న తర్వాత ఈ సినిమాకు పూరీ జగన్నాథ్ సీక్వెల్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయినట్లు తెలుస్తుంది. గోపిచంద్ కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సీక్వెల్‌ను కూడా బెల్లంకొండ సురేష్ నిర్మించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.